


# చల్లావారిల్లు

వంటింట్లో అమ్మా నాన్నా చిన్నగా రహస్యాలు మాట్లాడుకుంటున్నట్లనిపించింది. ఏవిటో ఇల్లు ఇల్లు అనుకుంటున్నారు. నెమ్మదిగా చేరా. అయినా ఏం అర్థం కాలా. ఇంక అడిగేశా!

''ఏంటమ్మా ! నాన్నా నువ్వూ గుసగుస లాడుకుంటున్నారు?'' అని. ఇందులో ఏం తప్పుందని చెప్పు ఆవిడగారలా గయ్యిమని లేవడం ?

'మొన్న నీకు ఏం చెప్పా సుశీలా ! అలా ముదిపేరక్కలా అన్నీ ఆరాలు తియ్యద్దన్నానా

లేదా ? నిన్ను చూసీ చూసీ నీ కూడా తిరిగీ తిరిగీ ఆ బుజ్జి కూడా నీలాగే తయారవుతోంది. మొన్న కూరంలో కారం వేస్తుంటే నాక్కాస్త పక్క నుంచి ఇంకొంచెం ఎక్కువేయమ్మా అందరికీ ఆటొస్తుందీ అని వాగుతోంది. ఛస్తున్నా మీతో!''

''అమ్మా నేను చిన్న పిల్లల్లా మాట్లాడే మనసు నీకింకా తీరలేదంటే చెప్పూ ! అలాగే మాట్లాడతా. ఏంతే అమ్మా ! నాన్నా నువ్వూ ఏం మాత్తాలుకున్నాలూ ? నాకు అప్పలు కోంపెలతాలా? ఇలా మాట్లాడచ్చా'' ఎందుకయినా మంచిదని కాస్త ఎడంగా నిలబడి అడిగా.

''ఛ నోర్మూయ్! నీలాటి దాన్నే చదవేస్తే వున్నమతీ పోయిందిట ! బొత్తిగా భయం భక్తీ రెండూ రోజంతా షికార్లే!'' ఇదే సందని నాన్న వాకిట్లోకెళ్లిపోయారు.

''ఆనక నన్నెప్పుడయినా తిట్టచ్చమ్మా కడుపు నిండేలాగా. అసలు సంగతేంటో చెప్పు!''

''మనం ఈ ఇంట్లోకొచ్చి ఎన్నాళ్ళయిందనీ! ఎవరో చుట్టాలొస్తారు! ఇల్లు ఖాళీ చెయ్యమంటున్నారు. మీ నాన్నకేమో తన వల్ల కాదుట. ఒక్కదాన్ని ఎన్నింటికని చావను ? లంబాడీ వాళ్లకన్నా కనా కష్టంగా వుంది నా బతుకు. వున్నచోట తినం. తిన్నచోట వుండం'' అని విసుక్కుంటూ వెళ్లిపోయింది.

నాన్నతో అయితే ఎంత కష్టమయిన పనయినా తపామని కొట్టినట్లు చెప్తుంది కదా ! మరి ఇలాటి చిన్న చిన్న వాటికెందుకు భయపడుతుందో పాపం. మేం ఎంతో పెట్టి పుట్టబట్టే కదా స్థావరాలం కాకుండా జంగమాలమయిందీ ! ఒకే వూళ్లో అయినా ఒకే ఇంట్లో పడుండేందుకు మనకేం ఖర్మ ! ఏ ఇల్లు నచ్చితే ఆ ఇంట్లో వుంటాం. ఎన్నాళ్లుండాలనిపిస్తే అన్నాళ్లుంటాం! అలా మరి సొంతిళ్లు సొంత వూళ్లు వున్నవాళ్లు చెయ్యగలరేవిటీ ? అక్కడే వుండాలి కాబోలని నోరు మూసుకునుంటారు. ఇంత చిన్న విషయం కూడా నే విడమర్చి చెప్తే గానీ అర్థం కాదావిడగారికి. 'నేనూ చిన్నారీ కలిసి వెతికి పెడతాంలే అమ్మా! ఇందూ బుజ్జీ మా వెంట పడకుండా చూసుకో!'' అని ధైర్యం చెప్పా!

అసలిల్లు ఎలా వెతకాలో తెల్సా? ఆదివారం పొద్దున్నే తినదల్చుకున్నవేవో తినేసి మాంఛి ఇస్త్రీ లంగా జాకెట్టు వేసుకుని ఏ పూలుంటే ఆ పూలు తల్లో పెట్టుకుని, మాంఛి అయినింటి ఆడపిల్లల్లా శుబ్భరంగా తయారయిపోయి దేవుడా తండ్రీ నీదే భారం అని దణ్ణమెట్టుకుని బయల్దేరాలి. అలా రోడ్డుమీద వారగా నడుచుకుంటూ దేనికిందా పడకుండా, దేన్నీ తొక్కకుండా నిమ్మళంగా ఒక్కొక్క ఇల్లే చూసుకుంటూ నడవాలి. అలా వెళ్లగా వెళ్లగా మనకి ఏ ఇల్లు బాగుందనిపిస్తే ఆ ఇంట్లోకివెళ్లి మంచిగా ముఖంపెట్టి ''మీ ఇంట్లో అద్దెకిచ్చేందుకు వాటాలున్నాయాండీ?'' అనడగాలి. అప్పుడు వాళ్లు మన నాన్న పేరదీ అడుగుతారు కదా! అన్నీ చెప్పేయడమే. మేం నలుగురాడపిల్లలం. మేమే పెద్ద అని కూడా చెప్పచ్చు. తర్వాత గొడవలు

రాకుండా ! ఒక్కోప్పుడు అందరూ ఆడపిల్లలే అంటే కొందరికి నచ్చచ్చు కూడా కదా !

అనుకున్నట్లుగానే ఆదివారం పొద్దున్నే ఇందూని బుజ్జీని ఏమార్చి చిన్నారీ నేనూ బయల్దేరాం. గవర్నరుపేట మొత్తం ఒక్కొక్క వీధే తిరిగాం. కానీ ఎవర్నీ అడగబుద్ధే కాలా! ఒక్క ఇల్లు కూడా నచ్చలా. వుంటే ఫాషనుగా మరీ పెద్దమేడల్లాగా అయినా వున్నాయి. తప్పితే చిన్న చిన్న పెంకుటిళ్లల్లాగా అయినా వున్నాయి. లీలామహల్ ఎదురు సందులో నడుస్తుండగా ఓ ఇంట్లోంచి సంగీతం వినిపించింది. ఎవరో ఆడపిల్లలు వర్ణాలు పాడుతున్నట్లనిపిస్తే అక్కడే నిలబడిపోయాం. నేను ఏలూర్లో సువర్ణ పక్కనే కూచుని సంగీతపాఠం వినేదాన్ని కదా ! అయ్యబాబోయ్ వర్ణాలు పాట్టమంటే ఎంత ప్రాణగండమో నాకు తెలుసు. ఇంతట్లోకే ఆ ఇంట్లోంచి ఒక తెల్లజుట్టున్న పెద్దాయన బయటికి వెడుతూ మమ్మల్ని చూసి

''ఎవరమ్మాయిలూ మీరు ? ఇక్కడెందుకు నిలబడ్డారు ?'' అని గదిమారు. ''పాట బాగుంటే వింటున్నామండీ'' అన్నాం.

''వింటే సరిపోతుందేవిటీ ? అలా లోపలికెళ్లి చూడండి ! జలజ, పంకజ ఎంత శ్రద్ధగా నేర్చుకుంటున్నారో! మీలా ఆదివారం చద్దన్నాలు తిని వూరేగట్లా'' అన్నారు. అయ్యబాబోయ్! ఈయనే స్కూల్లో మాస్టరో! చేతిలో బెత్తం వుంటే కొట్టేలా వున్నాడనుకుని 'మేం వేడన్నాలే తిన్నా వండీ! వూరికే తిరగటల్లా ! మా అమ్మేదో పని చెప్తేనూ!''

''సరి సరి లోపలికి పోండి. తాతగారు పంపారని చెప్పండి. వాళ్లనిప్పుడే పలకరించకుండా పక్కన కూచుని పాటలు వినండి'' అని ఆయన వెళ్లిపోయారు.

చిన్నగేటు తీసుకుని లోపల వరండా లోకెళ్లేటప్పటికి తెల్లగా పొట్టిగా నొక్కునొక్కుల జుట్టు వేలి ముడేసుకుని మడికట్టుకున్న ఒకావిడ ఓ చేత్తో తాళం వేస్తూ బయటకు వచ్చారు. పక్కకి పిల్చి ఏవిటని అడిగారు, వేంఠనే వచ్చిన పని చెప్పేశాం.

''అత్తయ్యగారూ ! మేం అద్దెకిచ్చేందుకు వాటా వుందేమోనని వెతుకుతున్నాం. సంగీతం వినిపిస్తే లోపలికి వచ్చి వింటున్నాం'' అని చెప్పాం.

''అబ్బో! మీకు సంగీతం అంటే ఇష్టవా ? ఎవరి దగ్గర నేర్చుకుంటున్నారు?'' అనడిగారు. ''రేడియోలో విని నేర్చుకంటున్నావండీ! మా అమ్మ ఇంకా సంగీతం చెప్పించట్లేదు'' అన్నాం. ''ఇంత పెద్దయ్యారు ! ఇంకా ఎప్పుడు మొదలెడతారట ! గొంతు సాధన అవాలా ! అయినా ఎవరింట్లో వుంటున్నారిప్పుడూ ?'' అనడిగారు.

''పచ్చిపులుసు సుబ్బారావుగారనీ'' చెప్పబోయే లోపలే 'ఈ నెలాఖరుకో వాటా ఖాళీ అవుతుంది గానీ మేం బ్రాహ్మలక్కానీ ఇవ్వం' అని వెళ్లిపోబోయారు.

''అయ్యయ్యో! ఆగండత్తయ్య గారూ ! మేం బ్రాహ్మలమే. మా నాన్న పాపం తద్దినాలు

కూడా పెట్టారు గుంటూరు తాతగారింట్లో! మాకేం అభ్యంతరం లేదు. బ్రాహ్మలింట్లో అయినా వుంటాం మా అమ్మని చూస్తే మీకే తెలుస్తుంది. కేకేసుకు రామా!'' అనడిగాం.

‘‘సరే అయితే, మీ అమ్మగార్నొస్తే రమ్మను. కానీ మావయ్యగారితోటే అన్నీ మాట్లాడాలి. మీ నాన్నగార్ని తీసుకుని సాయంత్రం రండి. పాఠం అయే వరకు ఆ చాపేసుకుని అలా కూచుని విని వెళ్లండని'' చెప్పి వంటింట్లోకెళ్లిపోయారు.

అదేం మాస్టారో దేవుడా! ఎంతకీ ఆపరే! ఒకటయాక ఒకటి అలా వర్ణాలు పాడిస్తూనే వున్నారు. ఆ ఇద్దరమ్మాయిలూ బాసెంపట్టేసుకుని కూచుని గాఠి గాఠిగా తాళం వేస్తూ కళ్లు మూస్తూ తెరుస్తూ పాడుతూనే వున్నారు. ఎప్పుడన్నా వాళ్లు నట్టితే వెంఠనే ఆయన పాడేస్తున్నారు పుస్తకం వంకన్నా చూడకుండా. ఆయనకెంత బాగా వచ్చో. ఎక్కడ నించయినా అందుకోగల్గు తున్నారు. ఎంతయినా మాస్టారు కదా. పాపం వీళ్లు ఓసారి తప్పితే మళ్లీ మొదట్నించీ పాడాల్సిందేట. మేం అలా కూచుని వింటూండగానే అత్తయ్యగారొచ్చి మమ్మల్ని చేతులు పట్టమని వెలక్కాయంత లడ్డూలు ఠాప్ ఠాప్ మని చేరోటి పడేసి లోపలికెళ్లిపోయారు.

మేం నిజంగా వాళ్లని రక్షించడానికే వచ్చినట్లున్నాం. మేం కూచున్న కాసేపటికి ఆయన వెళ్లిపోయారు. ఇంక జలజ పంకజ ఆ చాపెత్తేసి పుస్తకాలు గూట్లో పెట్టి బయట మెట్ల దగ్గరకి పిలిచారు కబుర్లు చెప్పుకునేందుకు వీలుగా. మా సంగతులన్నీ చెప్పేసి వాళ్ల విషయాలన్నీ కనుక్కున్నా. వాళ్ల మాస్టారు చాలా పేద్ద విద్వాంసులట. ఇలాటి చిన్నా చితకా మేళాలకి చెప్పరుట. కానీ వీళ్ల నాన్నగారికి సంగీతం అంటే వున్న ప్రేమ చూసి మాట తీసెయ్యలేక వారానికోసారి వస్తారట. ఒకవేళ కోపం వస్తే ఆయన వీళ్లు సాధన చెయ్యట్లేదనిపిస్తే రెండేసి వారాలు మానేస్తారట. అప్పుడు వీళ్ల నాన్నగారు వీళ్లని తిట్టి ఆయనని బతిమాలి మళ్లీ పిల్చుకొస్తారుట. వీళ్లు చదువు కోపోయినా కోప్పడరుట గానీ పాడకపోతే మాత్రం అన్నీ నాన్నగారూ కలిసి కోప్పడేస్తారుట.

నేనేవిటో ఇన్నాళ్లూ చదువుకోడవే అన్నిటికన్నా గొప్పనుకుంటున్నా. ఈ ఇంట్లో గ్గానీ మారితే సంగీతం కూడా ఇలాగే నేర్చుకోమని మా అమ్మ వెంట పడితే ఇంకేవన్నా వుందా ? చచ్చావే! మా ప్రాణాలు తోడయినా సంగీతం నేర్పిస్తుంది. కానీ ఈ అమ్మాయిల్నీ అత్తయ్య గార్నీ చూస్తే వదల బుద్ధవటల్లా ! అయినా మాలా వంకర టింకరగా పాడే వాళ్లకి పెద్ద పెద్ద విద్వాంసులెలాగు చెప్పడానికి ఒప్పుకోరు కదా !

మేం నలుగురాడ పిల్లలమని నాకు మహాగొప్ప కానీ వాళ్లయిదుగురుట. కానీ ఇద్దరాటలకి పనికి రార్లే ! పెళ్లయి అత్తారిళ్లకి వెళ్ళి పోయారుట. మాకో తమ్ముడూ లేడూ !

కానీ వాళ్లకెంచక్కా ఓ అన్నయ్య వదినా ఓ పాపాయీ వున్నార్ట. ఆ బుజ్జిదెంత బాగుందో ! ఈ మూల్నించి ఆ మూలకి పాకేస్తోంది. జలజా వాళ్లే బయటనించి ఇల్లు చూపించారు. నాలుగు వరుస గదులు నాలుగోది వంటిల్లు. దొడ్లో మడి బావిట. పెద్ద నారింజ చెట్టు. దానికింద రోలు. పెరట్లో ఇంకో రెండు వాటాలున్నాయి. ఆ ఇంటి మేడకి ముందునించి పెరట్లోంచీ కూడా మెట్లున్నాయి. ఇంక ఇంత మంచిల్లు దొరికాక తిరగడం ఎందుకులే అని తిన్నగా ఇంటికొచ్చేశాం.

ఇంటి దగ్గర అమ్మా సావిత్రొదినా కబుర్లు చెప్పుకుంటున్నారు. మంచం మీద చెరో దిండు వేసుకు పడుకుని, వదినడిగింది.

''ఏవే ఇంతసేపుండిపోయారూ ? కాయా పండా?'' అని.

''మనం ముగ్గేస్తే పండే! లీలా మహల్ ఎదురుగానే. వాళ్ల పిల్లలు సంగీతం పాడుతుంటే వుండిపోయాం. ఈ నెలాఖరుకి పక్కవాటా నాలుగ్గదులు ఖాళీ అవుతాయట. నాన్నని రమ్మన్నారు అత్తయ్యగారు'' అని చెప్పా.

''ఆ ఇల్లే ! భలే పట్టారే మీ ఇల్లు బంగారం కానూ ! ఈ వూళ్లో వాళ్లనెరగని వాళ్లెవరు ! చల్లవారిల్లు అయి వుంటుంది. ఆవిడ మహాలక్ష్మి మడికట్టుకున్నట్లున్నారు కదే ! ఈ వూళ్లో ఏ దక్షిణాది విద్వాంసుడు కచేరీ చేసినా బస వాళ్లింట్లో చెయ్యాల్సిందే. వాళ్లింట్లో వుంటేనే చాలు సరోజమ్మా నీ పిల్లలకి వేరే సంగీతం నేర్పక్కర్లేదు. సాయంత్రం వెళ్లి కుదిర్చేసుకోండి'' అని మా అమ్మకి ముఖ్య సలహాదారు గారు జండా వూపేసింది.